క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా లక్ష్మణ్



వెల్దండ: మండల కేంద్రంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సత్యపాల్‌రెడ్డి రెండు నెలల పాటు విదేశాలకు సెలవులపై వెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఎంపీఓ లక్ష్మణ్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు. వేసవి కావడంతో కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో తాగునీరు సమస్య లేకుండా చూడాలని పేర్కొన్నారు.

ఎస్‌బీఐ భవనం మార్పు



వెల్దండ: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌ను పాత బీఎస్‌ఎన్‌ఎల్ భవనంలోకి మార్పు చేసినట్లు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ దేవేందర్ పవర్ పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం వెల్దండ–చారకొండ రోడ్డులోని పాత బీఎస్‌ఎన్‌ఎల్ భవనంలోకి బ్యాంక్ మార్పు చేసినట్లు పేర్కొన్నారు. ఖాతాదారులు గమనించి సహకరించాలని కోరారు.

వ్యాఖ్యాతకు మంత్రి అభినందన



మన్ననూర్: పదర మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మజీద్ కొంత కాలంగా క్రికెట్ పోటీలలో యాంకరింగ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో మన్ననలు పొందాడు. సోమవారం ఎల్‌బీ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో మజీద్ యాంకర్‌గా వ్యవహరిస్తూ ప్రేక్షకులను ఉత్సాహపరిచాడు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ యాంకర్‌ను అభినందించాడు.

సంగీత, నృత్య శిక్షణ ప్రారంభం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని న్యూఎరా కళాశాల ఆవరణలో స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో వేసవి నృత్య శిక్షణ శిబిరాన్ని సోమవారం మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ప్రారంభించారు. నెల రోజులపాటు జానపదం, వెస్టర్న్ తదితర విభాగాలలో విద్యార్థులకు నృత్య శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం స్వర్ణభారతి కళానిలయం వ్యవస్థాపకుడు మోహన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు, సదానందంగౌడ్, చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చారకొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన సిరిగిరి హరికృష్ణ కొన్ని నెలల కిందట అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో రూ.60 వేలు మంజూరయ్యాయి. సోమవారం బాధిత కుటుంబానికి గ్రామ నాయకులు మాజీ ఎంపీటీసీ బోడ్డుపల్లి కొండల్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దామర్ల వెంకటయ్య, అశోక్, వెంకటయ్య, లక్ష్మయ్య, సైదులు భీమయ్య, ఉన్నారు.

చెక్కు పంపిణీ

కోడేరు: మండలంలోని మాచుపల్లికి చెందిన అలివేలమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 33500లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ నాయకులు కురుమూర్తి బాధిత కుటుంబానికి అందజేశారు. పరశురాముడు, రామచంద్రయ్య, రాజు,పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

వీపనగండ్ల: మండలంలోని నాగర్లబండతండాలో సరైన విద్యుత్ వసతి లేక స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించే విధంగా సోమవారం స్తంభాలు ఏర్పాటు చేయడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యను మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించగా వెంటనే 18 స్తంభాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించగా.. వారు పనులు వేగంగా పూర్తి చేశారు.

జీతాలు రాక.. వెతలు తీరక

- భారంగా మారిన కుటుంబ పోషణ
- ఇబ్బందుల్లో ఉపాధి హామీ కూలీలు



పనుల్లో పాల్గొన్న కూలీలు

తాడూరు: గ్రామాల్లో వలసలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామి పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా కూలీలకు వివిధ రకాల పనులు కల్పిస్తున్నారు. అధికారులు గ్రామసభలు నిర్వహించి ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పిస్తూ ముందుకెళ్తున్నారు. అధికారుల సూచన మేరకు సకాలంలో కూలీలు పనులు పూర్తి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు పనులపై పర్యవేక్షణ చేస్తున్నారు. కాని ఉపాధి కూలీలకు కూలి డబ్బులు ఇవ్వడం నిర్లక్ష్యం వహిస్తున్నారు. కూలీలు, ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాక అవస్థలు ఎదుర్కొంటున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు జీవితాలు దుర్భరంగా మారాయి. అప్పులు చేసి కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు కీలకభూమిక పోషిస్తున్నారు. పనుల ఎంపికతో పాటు కూలీలు పనికి వచ్చేవిధంగా వారిని చైతన్యం చేసి పనికి తీసుకెళ్తారు. రిజిస్టర్‌లో వివరాల నమోదు వంటి పనులు చేపడుతున్నారు. పథకంలో పక్కగా అమలు అవుతుందంటే ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర మరచిపోలేనిది.

యాప్‌లో వివరాల నమోదు

కూలీలు పనికి వచ్చిన వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లు వారి పేర్లను నమోదు చేసుకొని ఫొటో తీసి యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. పని పూర్తి అయిన తర్వాత ఫొటో తీసి యాప్‌లో పొందుపరుస్తున్నారు. సకాలంలో వారికి వేతనాలు రాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పని దినాలు కల్పించిన వారిని కేటగిరిగా విభజించారు. అత్యధిక కేటగిరి వారికి నెలకు రూ.12200లు, రెండో దశ ఎఫ్‌ఏలకు రూ.9 వేలు, మూడో కేటగిరికి చెందిన ఎఫ్‌ఏలకు రూ.7700 వేతనంగా నిర్ణయించారు.

15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు

24 గ్రామ పంచాయతీల్లో 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తుండగా మిగిలిన గ్రామాల్లో సీనియర్ మేట్‌లు విధులు నిర్వహిస్తున్నారు. వారికి జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు అందాల్సి ఉంది. ఉన్నతాధికారులకు ప్రజా ప్రతినిధులకు సమస్య విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయాలని మండలంలోని ఎఫ్‌ఏలు కోరుతున్నారు. మరోవైపు 8396 జాబ్ కార్డులు ఉండగా పనిలో 4907 మంది కూలీలుగా హాజరవుతున్నారు. అందులో 7896 పనిదినాలు చేస్తున్నారు. వీరికి సైతం వేతనాలు అందలేదు.



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

వేతనాలు చెల్లించాలి



ప్రభుత్వం ఆదేశాల మేరకు పనులు చేయిస్తున్నాం. ప్రతి నెల జీతాలు చెల్లించడం లేదు. మూడు నెలలుగా వేతనాలు మంజూరు కాలేదు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. వెంటనే జీతాలు చెల్లించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

–హన్మంత్, ఫీల్డ్ అసిస్టెంట్

ఉన్నతాధికారులకు నివేదించాం



గ్రామాల్లో ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీలకు ఉపాధి హామీ సిబ్బంది సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం వాస్తవమే. 3 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్వహణ భారంగా మారింది. వేతనాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– చంద్రసిద్దార్థ, ఏపీఓ

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

వెల్దండ: అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికల్లో ఆయా గ్రామాల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. ఆర్థిక పరిస్థితి క్లిష్ట పరిస్థితిలో ఉన్న నిరంతరం అభివృద్ధే లక్ష్యంగా సీఎం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. పంట రుణమాఫీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధి చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్యాపిష్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీసింగ్, కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, మోతీలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, పుల్లయ్య, కృష్ణముదిరాజ్, రాజశేఖర్, కృష్ణ, శంకర్‌నాయక్, అలీ, రషీద్, కార్యకర్తలు, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్, ఏఓ శోభారాణి, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి, తదితరులు ఉన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజా ఆశీర్వాదంతోనే కోలుకున్నా



ఉమామహేశ్వరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

అచ్చంపేట రూరల్: ప్రజా ఆశీర్వాదంతోనే అనారోగ్యం నుంచి కోలుకున్నానని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గుండెకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకుని రెండు నెలల తర్వాత సోమవారం అచ్చంపేటకు ఎమ్మెల్యే వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజీపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఉమామహేశ్వర క్షేత్రంతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగాపూర్ నిరంజన్ షావలి దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

వంగూరు: గుండె ఆపరేషన్ అనంతరం మొదటిసారిగా నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. శ్రీశైలం చౌరస్తా, తిరుమలగిరి స్టేజీ వద్ద పూలబొకె ఇచ్చి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంగూరు స్టేజీ వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, సతీమణి అనూరాధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, క్యామమల్లయ్య, యాదగిరిరావు, షేర్ ఖాన్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురం సమీపంలో ఉన్న మాత శిశు సంరక్షణ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా నాయకులు సాయికృష్ణ, భరత్ డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ బృందం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి జూపల్లి ఉన్న కొల్లాపూర్ నియోజకవర్గ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేకపోవడం దారుణమన్నారు. ఇక్కడ డాక్టర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి వసతి లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డయాలసిస్ రోగులకు విద్యుత్ సౌకర్యం లేక అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను వెంటనే నియామకం చేపట్టాలని మంత్రి జూపల్లిని కోరారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయికృష్ణ, భరత్, పాండు,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకులు

అనర్హుల ఎంపికపై ఆగ్రహం

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లిలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల అనర్హులను ఎంపిక చేశారని సోమవారం గ్రామస్తులు ఇందిరమ్మ కమిటీ సభ్యులను ప్రశ్నించారు. అధికారులు ప్రకటించిన 30 మంది లబ్ధిదారుల పేర్లలో కొంతమంది అనర్హులను ఉన్నారని వాపోయారు. పారదర్శకంగా మరోసారి సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్నా కొందరి పేర్లు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు కల్పించుకొని శాంతింపజేశారు. ఈ విషయంపై గ్రామ ప్రత్యేక అధికారి ఎంఈఓ చంద్రుడును వివరణ కోరగా గతంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు 30 మంది జాబితా ఇవ్వగా అందులో ఇంటింట తిరిగి పూర్తి సర్వే చేసి 18 మంది మాత్రమే అర్హులుగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు అసత్య ప్రచారాలు నమ్మొద్దని సూచించారు.



ఇందిరమ్మ కమిటీ సభ్యులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడూరు: మేడిపూర్, ఎంగపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు ఏర్పడే అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని విద్యుత్ ఏఈ శ్రీరాములు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం గుంతకొడురు గ్రామం దగ్గర నేషనల్ హైవేపై విద్యుత్ పనులను నిర్వహిస్తు న్నామని మేడిపూర్, ఎంగంపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గుంతకొడురు ఎంగంపల్లి అల్లాపూర్, పోల్మూర్, అకునెల్లికుదురు, మేడిపూర్, గుట్టలపల్లి, గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పెద్దకొత్తపల్లి: మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. యాసంగిలో మండలంలో 6232 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. మొక్కజొన్న పంటను రైతులు కోస్తున్నారు. మొక్కజొన్న క్వింటాలుకు రూ.2332 లు పలుకుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ప్రైవేట వ్యాపారులు తక్కువ ధరకే విక్రయించి నష్ట పోతున్నారు.

ద్విచక్రవాహనం బోల్తా: ఇద్దరికి గాయాలు

చారకొండ: ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం బోల్తాపడి ఇద్దరి వ్యక్తులకు గాయాలైన ఘటన మండలంలోని జూపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి –దేవరకొండ రహదారిపై జూపల్లి బస్‌స్టేజి సమీపంలో సోమవారం కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన పర్వతాలు, శ్రీనులు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నారు. అకస్మాత్తుగా రోడ్డుపై కుక్క అడ్డురావడంతో కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఇద్దరికి గాయాలుకావడంతో క్షతగాత్రులను ఆటోలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వెల్దండ సమీపంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదు



తిమ్మాజిపేట: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించడం సరికాదని మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ బహదూర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో మొదటి సారి ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పుడు కేసీఆర్ అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్రం సోనియాగాంధీ వల్లే సాధ్యమైందని కొనియాడారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక మాట మార్చడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నారమన్నారు. పూటకో మాట మార్చడం బీఆర్‌ఎస్ నాయకులకు అలవటేనని విమర్శించారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ మాధవ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే

బల్మూర్: మండలంలోని కొండనాగులలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల రీ సర్వేను ఇన్‌చార్జ్ ఎంపీఓ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీలు రూపొందించిన జాబితాల ఆధారంగా అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా అర్హులైన వారిని ఎంపిక చేయడం కోసం రీ సర్వే చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మధుమోహన్, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని రాఘయపల్లి, పెద్దాపూర్, గుండాల, చెదురుపల్లి, అజిలాపూర్ తదితర గ్రామాల్లో ప్రత్యేక అధికారులు సర్వే నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల జాబితా జిల్లా అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను సిద్ధం చేస్తున్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రుడు, పీఆర్‌ఏఈ సురేందర్‌రెడ్డి, కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారులను గుర్తిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్

తాడూరు: బలాన్‌పల్లి, అంతారం, యాదిరెడ్డిపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల రీసర్వే చేపట్టినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. ఆయా గ్రామాల్లో దరఖాస్తుదారుల ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. రీసర్వేలో శివకృష్ణ, ఎంపీఓ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని నాగులపల్లి, కొండ్రావుపల్లి, నాగులపల్లితండా, నర్సాయిపల్లి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను సర్వేను అసిస్టెంట్ ఇంజనీయర్ మోహన్‌నాయక్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, నరేష్‌గౌడ్, ప్రదీప్‌కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఖిల్లాఘనపురం: మానాజీపేట హెల్పింగ్ హ్యాండ్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండలంలోని మానాజీపేటలో ఏర్పాటు చేసిన క్యాంపును ఎంఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయులు రాఘవేందర్ నిత్యం విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వేసవిలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా విద్యతో పాటుగా ఆటలు, పాటలు పాడించడం, కథలు, డ్రాయింగ్‌పై శిక్షణ ఇవ్వడం అభినందించదగిన విషయమన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులకు గణితంలో మెలుకువలతో పాటు కబడ్డీ, ఖోఖో, చెస్ లాంటి ఆటలపై శిక్షణ ఇస్తున్నారు. స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన మేరెడ్డి రవిప్రకాష్‌రెడ్డి తన సొంత ఖర్చుతో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. క్యాంపు నిర్వహణకు గాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వలంటీర్లు, స్టడీ మెటీరియల్ ఖర్చును సంస్థ వారు భరిస్తున్నారు.

యూనిఫాంల దుస్తుల కటింగ్ పరిశీలన

మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో పాఠశాలల విద్యార్థుల యూనిఫాం దుస్తుల కటింగ్‌ను ఎంఈఓ జయశంకర్ పరిశీలించారు. జూన్ 12వ తేదీ పాఠశాలలు తెరిచే సమయానికి ఒక జత బట్టలను విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు తదితరులు ఉన్నారు.

బకాయిలు చెల్లించాలని ఆశాల ఆందోళన

నాగర్‌కర్నూల్ రూరల్: కుష్టు సర్వే బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలంటూ ఆశా కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్దం పర్వతాలు మాట్లాడుతూ.. మూడేళ్ల కిందట కుష్టు సర్వే చేసిన ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ నేటి వరకు డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. బకాయి బిల్లులు చెల్లించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మే 20న సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డా. స్వరాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాదిలి రామయ్య, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు కళావతి, కార్యదర్శి చెన్నమ్మ, శ్రీదేవి, వసుంధర, భాగ్యలక్ష్మి, అమినా, వరలక్ష్మి, బాలమణి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

తెరుచుకోని పశువైద్యశాల



పెద్దకొత్తపల్లి: పెద్దకార్పములలో గ్రామీణ పశు వైద్యశాలలో సిబ్బంది నియమించకపోవడంతో మూతపడింది. రూర్బన్ మిషన్ పథకంలో రూ.10లక్షలతో పశువైద్యశాలను నిర్మించారు. ప్రభుత్వం పశువైద్యశాలకు సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం విఫలం అయ్యింది. దీంతో చేసేదేమి లేక పశువైద్యశాలకు తాళం వేశారు. పశువులు రోగాలబారిన పడితే మండల కేంద్రానికి వెళ్లాల్సివస్తోందని రైతులు వాపోయారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

తిమ్మాజిపేట: దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని మార్కెట్ డైరెక్టర్ చెవ్వ మాధవులు అన్నారు. సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదిక ఎదుట ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌బహదూర్, రవూఫ్, లక్ష్మీనారాయణ, దేవస్వామి, హర్షు, ముబారక్, మనోహర్, భాస్కర్‌గౌడ్, ఎల్లారెడ్డి, కిషన్, ఏపీఎం బాలస్వామి, ఐకేపీ, వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహం చట్టరీత్యా నేరం

పాన్‌గల్: మైనర్ బాలికను వివాహం చేసుకునేందుకు సిద్ధపడిన అబ్బాయిపై తగు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోమవారం ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రోశయ్య తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు ఎంగేజ్‌మెంట్ చేస్తున్నారని ఈనెల 20వ తేదీన 1098 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం వచ్చిందన్నారు. దీంతో డిపార్ట్‌మెంట్ వారితో కలిసి బాలిక ఇంటికి వెళ్లి అమ్మాయి చదువుకున్న ధ్రువపత్రాలను పరిశీలించగా వయస్సు 15సం.10 నెలల 3 రోజులుగా ఉందన్నారు. మైనర్ బాలికతో వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు, ఎంగేజ్‌మెంటుకు హాజరైన వారందరికీ అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. అవగాహన కల్పించినా.. వాటిని పెడచెవిన పెట్టి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన శంకర్‌తో మైనర్ బాలికతో వివాహం జరిపించుటకు పెద్దలందరూ నిర్ణయించుకొని ఈనెల 23వ తేదీన ఎంగేజ్‌మెంట్ జరిపించారు. దీంతో మైనర్ బాలికను వివాహం చేసుకునేందుకు ముందుకొచ్చిన అబ్బాయి శంకర్‌పై బాల్య వివాహ నిషేధ చట్టం –2006 ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



బల్మూర్: మండలంలోని మైలారం–అంబగిరి బీటీ రోడ్డుపై ఏర్పడిన రంధ్రంతో ప్రమాదకరంగా మారింది. మైలారం స్టేజీ నుంచి వెళ్లే ఈ రహదారిపై వ్యవసాయ పొలాల్లో నిలిచిన నీళ్లు చెరువులోకి వెళ్లేందుకు మినీ కాజ్‌వే నిర్మించాల్సి ఉన్నా అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఏడాది కిందట పాతరింగ్‌పై నుంచే బీటీ రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. కాని ప్రస్తుతం ఈ ప్రాంతలో ఉన్న రింగ్ కుంగి నడిరోడ్డుపై రంధ్రం ఏర్పడింది. నెల రోజుల నుంచి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండ రంధ్రం వద్ద రాయి ఏర్పాటు చేశారు. రాత్రి వేళ వాహనదారుల అవస్థలు పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.